సాక్షి మంచిర్యాల

శనివారం । 9 । ఆగస్టు । 2025

సెల్ఫీ విత్ రాఖీ



అన్నాచెల్లెలు.. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ఎప్పటికీ చిత్రమై నిలిచేలా 'సాక్షి' అవకాశం కల్పిస్తోంది. అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టినప్పుడు సెల్ఫీ ఫొటో దిగి శనివారం వాట్సాప్ చేయండి. మీ పేరు, గ్రామం/పట్టణం, మండలం వివరాలు పంపించాలి. ఉత్తమమైన వాటిని సాక్షి దినపత్రికలో ప్రచురిస్తాం.

పంపించాల్సిన నంబరు 90100 57302

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

'రక్షా బంధన'మై..!

అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలు, అనుబంధాలకు రాఖీ పండుగ వారధిగా నిలుస్తుంది. అక్కాచెల్లెళ్లు ఎక్కడున్నా సరే పండుగ వచ్చిందంటే చాలు పుట్టింటికి చేరుకుంటారు. సోదరులకు రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను చాటుకుంటారు. మా ఆనందంలో మీరుంటారని.. మీకు ఆపద రాకుండా అండగా మేముంటామని అన్నదమ్ములు భరోసానిస్తుంటారు. నేడు రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకం.

రాఖీ కట్టి ఒక్క రూపాయే తీసుకుంటారు



బెల్లంపల్లి: నా చదువంతా హాస్టల్లో కొనసాగింది. పండుగలకు ఇంటికి దూరంగా ఉండేవాడిని. అక్కాచెల్లెళ్ల ఆత్మీయత, అనురాగాలకు ప్రతీకగా నిలుస్తున్న రాఖీ పండుగకు కూడా తోబుట్టువులకు అందుబాటులో ఉండేవాడిని కాదు. కానీ ఆ పండుగ నాకెంతో ప్రత్యేకమైంది. నేనెంత దూరం వెళ్లి చదువుకుంటున్నా సరే మా అక్క లక్ష్మీమౌనిక, మా బాబాయి, పిన్నిల కూతుళ్లు ఇద్దరు కలిసి వచ్చి చేతికి రాఖీ కట్టి నిండు మనస్సుతో ఆశీర్వదించడం క్రమం తప్పక వస్తున్న ఆనవాయితీ. ఈ తీపి జ్ఞాపకాలు ఎన్నడూ మర్చిపోలేను. రాఖీ కట్టినందుకు మా అక్కాచెల్లెళ్లు నా నుంచి కట్నకానుకలు ఏమీ ఆశించేవారు కాదు. డబ్బు ఇవ్వడానికి సిద్ధపడితే ససేమిరా ఒప్పుకునే వారు కాదు. నా తృప్తి కోసం ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఒక్కొక్కరు ఒక్కో రూపాయి చొప్పున తీసుకుని సంతోషపడే వారు. నేటికీ అదే కొనసాగుతోంది. నా జీవితంలో రాఖీ పండుగకు ఎంతో అనుబంధం ఉంది. 2023లో నాగ్‌పూర్‌లో ఇన్‌కంట్యాక్స్ అధికారిగా శిక్షణ పొందుతున్న సమయంలో పండుగ వచ్చింది. మా ముగ్గురు అక్కాచెల్లెళ్లు నాగ్‌పూర్‌కు వచ్చి నా చేతికి రాఖీ కట్టి దీవించారు. ఆ వేళ యాదృచ్ఛికంగా యూపీఎస్సీ ఫలితాలు వెల్లడై ఐఏఎస్‌గా సెలక్ట్ అయ్యాను. ఆ తీపి గుర్తు నేనెన్నడు మర్చిపోలేను. – బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఐఈఎస్ఎస్‌డీ మనోజ్

ప్రతీ సంవత్సరం ఇక్కడే..



పాతమంచిర్యాల: హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వచ్చి అన్నయ్యకు రాఖీ కడుతాను. మేము ఇద్దరం అక్కాచెల్లెళ్లం నిర్మల, ప్రమీల. మా ఇద్దరు అన్నయ్యలు శ్రీనివాస్ గోదావరిఖనిలో, దామోదర్ గోదావరిఖనిలో ఉంటారు. వారికి రాఖీ కట్టడానికి పండుగకు ఒక్కరోజు ముందే మంచిర్యాలకు చేరుకుంటాను. దురదృష్టావశాత్తు పెద్దన్నయ్య శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. అన్నాచెల్లెళ్ల అనుబంధం మాటల్లో చెప్పలేనిది. – ప్రమీల, హైదరాబాద్

మా అన్నే వస్తున్నడు..



చెన్నూర్: ఉద్యోగరీత్యా మా అన్న హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రతీయేడు రాఖీ కట్టడానికి హైదరాబాద్ వెళ్తాను. ఈయేడు మా అన్నే మా ఇంటికి వస్తున్నాడు. చాలా సంతోషంగా ఉంది. అన్ని రాఖీ పండుగల కంటే ఈసారి పండుగను మరింత సంతోషంగా జరుపుకుంటాం. – సుమలత, చెన్నూర్ కస్తూర్బా కళాశాల ప్రిన్సిపాల్

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే పీఎస్సార్‌కు మంత్రి సీతక్క పరామర్శ



ప్రేమ్‌సాగర్‌రావును పరామర్శిస్తున్న మంత్రి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)ను రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుక్రవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. గతంలో ఆయన కాలుకు జరిగిన ఆపరేషన్ వద్ద ఇన్‌ఫెక్షన్ కావడంతో మరోసారి ఆపరేషన్ చేసి ఇన్‌ఫెక్షన్‌ను తొలగించారు. త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. డీసీసీ అధ్యక్షురాలు కే.సురేఖ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌ల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న మెడికల్ కౌన్సిల్ సభ్యులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌లను తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర యగ్గన్న శ్రీనివాస్ నేతృత్వంలోని టీజీఎంసీ బృందం శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో ఇటీవల ఓ ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్న ఓ యువకుడు వైద్యం వికటించి మృతిచెందినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టీజీఎంసీకి ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో టీజీఎంసీ సభ్యులు ఆర్ఎంపీ కేంద్రాలను శుక్రవారం రాత్రి వరకు తనిఖీ చేశారు. కనీస విద్యార్హతలు, లైసెన్స్ లేకుండా వైద్యులమని ఎలా చెప్పుకుంటున్నారని, ఇంజక్షన్లు, మందులు, గర్భవిచ్ఛిత్తి ఇంజక్షన్లు ఎందుకు ఉన్నాయంటూ మందలించినట్లు సమాచారం. ఓ క్లినిక్‌లో రెండు పడకలు ఏర్పాటు చేసి రోగికి యాంటీబయోటిక్ ఇంజక్షన్ కూడా ఇస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మీ సేవ లేవా..!

- ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు చేసినవే
- కొన్ని చోట్ల నడవలేక కేంద్రాలు మూసివేత
- అవకాశమివ్వాలని నిరుద్యోగుల వినతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో మీ సేవ కేంద్రాల ఏర్పాటు ఉంటుందా? లేదా? అని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. అవసరమైన చోట్ల తమకు అవకాశం కల్పించాలని విన్నవిస్తున్నారు. పౌరులకు సులభంగా, వేగంగా ఎలక్ట్రానిక్ సేవలు అందించాలని మీ సేవలు నిర్వహిస్తున్నారు. గత నిబంధనల ప్రకారం కొత్తవి ఏర్పడే అవకాశం ఉండగా, ఇటీవల సవరించిన నిబంధనలతో కొత్త కేంద్రాల ఏర్పాటు అవకాశాల కోసం జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ఓఎస్ఎస్(వన్ స్టాప్ ఫైనాన్షియల్ సర్వీస్ సెంటర్), టీజీటీఎస్(తెలంగాణ టెక్నాలజీ సర్వీస్), తెలంగాణ ఆన్‌లైన్(టీజీఆన్‌లైన్) కింద మీ సేవలు సెంటర్లు నడుస్తున్నాయి. ఆయా శాఖల్లోని అధికారిక సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. పౌరులకు మున్సిపల్ వ్యవసాయ, ఆర్టీఏ, విద్యుత్, పోలీసు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ, టీ వాలెట్, దేవాదాయ శాఖలు ఇతర సేవలతోపాటు దాదాపు మూడు వందలకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి.

19కేంద్రాలు రద్దు

జిల్లాలో ఉన్న మీ సేవ కేంద్రాలు చాలా వరకు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. రాజకీయ పలుకుబడితో కొందరు దక్కించుకున్నారు. అయితే తర్వాత సరిగా నడవలేక, ప్రస్తుతం 139 మీ సేవ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో చాలా వరకు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిర్వాహకులకు రెవెన్యూ సంబంధిత ఒక్కో డాక్యుమెంట్‌కు గరిష్ఠంగా రూ.12వరకు కమీషన్ వస్తోంది. ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తూ నెట్టుకొస్తునారు. కొన్ని చోట్ల ఆదాయం రాక మూత పడుతున్నాయి. ఇప్పటికే 19కేంద్రాలు రద్దయ్యాయి. జిల్లాలో చివరి సారిగా 2017లో కొత్త కేంద్రాలకు అనుమతి ఇవ్వగా, మరోసారి ఎక్కడెక్కడ అవసరం ఉందో స్థానిక తహసీల్దార్ల నుంచి నివేదిక తీసుకున్నాక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి.



మారిన నిబంధనలు

కొత్త నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 5వేల జనాభాకు ఒక మీ సేవ ఏర్పాటు చేయాలి. పట్టణాల్లో 8వేల జనాభా, మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి. నిర్వాహకులు డిగ్రీ, కంప్యూటర్ సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. జిల్లా ఈ గవర్నెన్స్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్త మీ సేవ కేంద్రాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక చేసి మంజూరు చేస్తారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ సొసైటీకి అదనపు కలెక్టర్, సీపీతో సహా కార్మిక, గ్రామీణ, పౌరసరఫరాల, పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు సభ్యులుగా ఉంటారు.

జిల్లాలో మీ సేవ కేంద్రాలు

ప్రభుత్వ	3
టీజీటీఎస్	121
టీజీఆన్‌లైన్	10
ఓఎస్ఎస్	5
మొత్తం	139

కొత్తవి వద్దంటున్న నిర్వాహకులు

కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తే తమ అవకాశాలను దెబ్బతిస్తాయని ప్రస్తుత నిర్వాహకుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. హాజీపూర్, లక్సెట్టిపేట, చెన్నూరు మండలాల్లో కొందరు కోర్టుకు వెళ్లడంతో కొత్త కేంద్రాల ఏర్పాటు నిలిచిపోయింది. మరోవైపు సేవ దృక్పథంతో కాకుండా అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు, అధికంగా ఫీజుల వసూళ్ల కారణంగా నిర్వాహకులకు జరిమానాలు విధిస్తున్నారు. ఇటీవల తాండూరులో జరిమానాలు వేశారు. కనీసం రూ.2వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా, మూడోసారి వరకు తప్పు చేస్తే సెంటర్ రద్దు చేసే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి రెవెన్యూ వ్యవహారాల్లో అధికంగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



జన్నారంలో వరలక్ష్మీ పూజ చేస్తున్న మహిళలు

– వివరాలు 9లో ▸

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

జిల్లాలో మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఇళ్లలో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి నోములు నోముకున్నారు. పసుపు, కుంకుమలను ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మందుల నిల్వలు, వార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం బొప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించి మూత్రశాలలు, హాజరుపట్టిక పరిసరాలను పరిశీలించారు. మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని ఎస్‌వో హరితను ఆదేశించారు. తహసీల్దార్ రాఘవేందర్ రావు, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్

అమృత్ 2.0 పనులు పూర్తి చేయండి

చెన్నూర్: అమృత్ 2.0 పథకంలో నిర్మిస్తున్న ట్యాంక్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో ట్యాంక్ పనులను పరిశీలించారు. పనులు పూర్తయ్యే వరకు ఇంటింటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని సూచించారు.

శివసాగర్ చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సాధన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందం శుక్రవారం జిల్లా కేంద్రంలోని శివసాగర్ చెరువులో సాధన చేశారు. కమాండెంట్ వెంకటరాములు ఆధ్వర్యంలో సాధన చేస్తున్న బృందానికి మంచిర్యాల అగ్నిమాపక శాఖ సిబ్బంది సహకారం అందించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడే అధునాతన పరికరాలను ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో ఏ విధంగా వినియోగించాలనే పలు అంశాలతోపాటు కఠిన సమయాల్లో ఆపదలో ఉన్నవారిని ఏ విధంగా రక్షించాలనే అంశాలపై సాధన చేశా రు. మంచిర్యాల జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ అశోక్, ఆర్ఎస్సై సురేశ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



తిలక్‌నగర్ చెరువులో బోటులో ప్రయాణిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

ఆర్టీసీకి రాఖీ కట్నాలు..!

- ప్రయాణికులపై అదనపు చార్జీల భారం
- రూ.100కు రూ.50 పెంపు..!
- రద్దీతో అదనపు బస్సులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్ శుక్రవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. తెల్లవారితే శనివారం రాఖీ పండుగ కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారింది. కాగజ్‌నగర్, గోదావరిఖని, చెన్నూర్ రూట్లలో రద్దీ ఎక్కువగా కనిపించింది. వచ్చిన బస్సు వచ్చినట్లే నిండిపోవడంతో కొందరు నిల్చుండి గమ్యస్థానానికి పయనమయ్యారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ఆర్టీసీ అవకాశం దొరికినప్పుడల్లా ప్రయాణికులపై చార్జీల భారం మోపుతోంది. హైదరాబాద్ జేబీఎస్, మియాపూర్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. రోజువారీ బస్సులతోపాటు శుక్రవారం మరో 12 బస్సులు నడిపించింది. పండుగ నేపథ్యంలో స్పెషల్ సర్వీసుల్లో అదనపు చార్జీల భారం మోపింది. సాధారణ రోజుల్లో నడిచే బస్సు చార్జీల కంటే రూ.100కు రూ.50 పెంచింది. సాధారణ రోజుల్లో సూపర్‌లగ్జరీ బస్సు చార్జీ రూ.530 ఉంటే స్పెషల్ సర్వీసుల్లో టికెట్ చార్జీలు రూ.740కు పెంచారు. ఈ లెక్కన ఒక్కో ప్రయాణికుడు రూ.210 అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మంచిర్యాల నుంచి జేబీఎస్‌కు రూ.390 ఉండగా.. అదనంగా రూ.160వరకు పెంచారు. శుక్రవారం రెండు స్పెషల్ సర్వీసులు నడిపించారు. పండుగ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం అప్ ఖాళీగా వెళ్లి డౌన్(హైదరాబాద్ నుంచి) ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడం జరుగుతుందని, పండుగ సమయంలో స్పెషల్ బస్సుల్లోనే చార్జీలు పెంపు వెసులుబాటు ఉంటుందని ఓ అధికారి తెలిపారు.



మంచిర్యాల బస్టాండ్‌లో ప్రయాణికులు

మారని బతుకులు

- ఆదివాసీల జీవితాల్లో వెలుగేది?
- గిరి గ్రామాలకు సౌకర్యాలు కరువు
- రోడ్లు లేవు.. వైద్యసేవలకూ తిప్పలే
- విద్యావకాశాలను అందిపుచ్చుకోని వైనం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదివాసీ జనాభా (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో)

గోండు	2,63,515
కొలాం	38,176
కోయ, ఇతరులు	30,739
పర్ధాన్	26,029
మన్నెవార్	15,370
నాయక్‌పోడ్	5,206
ఎరుకుల	1,735
మొత్తం	3,83,001

షెడ్యూల్డ్ మండలాలు (ఉమ్మడి జిల్లాలో)

పూర్తి షెడ్యూల్డ్ మండలాలు 07
వాటి పేర్లు: గాదిగూడ, ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ)
మిగతావి:పాక్షిక, నాన్ షెడ్యూల్డ్ మండలాలు

పోడు భూముల వివరాలు.. (ఉమ్మడి జిల్లాలో)

విస్తీర్ణం	2,12,256ఎకరాలు
రైతుల సంఖ్య	66,839
పట్టాలు ఉన్న సంఖ్య	66,839



ఉట్నూర్ మండలం వంకతుమ్మ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు ఉట్నూర్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ఇలా గ్రామానికి తిరిగిరావడం నిత్యకృత్యం. అలాగే ఈ గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో వాగు దాటాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో వీరిది దయనీయ పరిస్థితి. 2013లో జరిగిన రెండు ఘటనలు ఇప్పటికీ ఆ గ్రామస్తులు మరిచిపోలేరు. ఓ నిండు గర్భిణికి పురుటినొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో వాగు దాటడం ఆలస్యం కావడంతో ఆమె మృత్యువాత పడింది. అదే ఏడాది పాము కాటుకు గురైన మారుతిని ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో వాగు ఉప్పొంగిన క్రమంలో ఆయన మృతిచెందాడు.



నార్నూర్ మండలంలోని మల్లెంగి గ్రామ పంచాయతీ పరిధిలోని బారిక్‌రావుగూడ ఇది. వంద ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. వాగు దాటితేనే ఊరు చేరుకునేది. వర్షాకాలంలో ఇది ఉప్పొంగితే గ్రామస్తులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఇప్పటికీ అందని పరిస్థితి.



ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బుర్కి ఆదివాసీ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. చిన్నపాటి మొరం దారి గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. వర్షాకాలంలో వీరి అవస్థలు వర్ణనాతీతం. పెళ్లి అయినా సరే నడుచుకుంటే వెళ్లాల్సింది. కాగా, గత గవర్నర్ తమిళిసై ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ గ్రామ సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం.

ఐటీడీఏ ఆశయం నెరవేరేనా..

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయం ఉట్నూర్‌లో ఉంది. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమ ఆశయంతో కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1975 ఆగస్టు 1న ఏర్పాటు చేశారు. అయితే ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు దాటుతున్నా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుకు కృషి జరగడం లేదన్న అభిప్రాయం ఆదివాసీలు, గిరిజనుల్లో ఉంది.

ఇదీ ఆదివాసీల బతుకుచిత్రం. తరాలు మారుతున్నా వారి తలరాత మారడం లేదు. ఇందులో ఉట్నూర్ మండలంలో ని వంకతుమ్మ గ్రామం ఐదు దశాబ్దాల క్రితం, నార్నూర్ మండలంలోని బారిక్‌రావుగూడ నాలుగు దశాబ్దాల క్రితం, ఇంద్రవెల్లి మండలంలోని మామిడిగూడ 35 ఏళ్ల క్రితం ఏర్పడ్డవే. వంకతుమ్మ గ్రామం ఐటీడీఏ కొలువున్న ఉట్నూర్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి దుస్థితిలో అనేక ఆదివాసీ గ్రామాలు కనిపిస్తాయి. నేటికీ కనీస వసతులకు దూరంగా గిరిపుత్రులు దుర్భర జీవనం గడుపుతున్నారు. తాగునీటికీ తల్లడిల్లే గూడేలు, దారి సౌకర్యం కురువై వైద్యసేవలకు తప్పని ఇక్కట్లు వీరికి షరా మామూలే. ఓ వైపు దేశం సాంకేతికంగా దూసుకుపోతున్నా ఇంకా విద్యుత్ సౌకర్యం లేని గిరి గ్రామాలు సైతం ఉన్నాయి. అడవులను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ప్రధానంగా పోడు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు. అధికారులు అందరికీ పట్టాలిచ్చామని చెబుతున్నా ఇంకా పట్టాలు రాని వారు పోరాడుతూనే ఉండడం గమనార్హం. – సాక్షి, ఆదిలాబాద్

క్లుప్తంగా

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

దహెగాం: మండలంలోని పీకలగుండం సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. పీకలగుండం సమీపంలో కల్వాడ గ్రామానికి చెందిన అజ్మీర రాములు అనే వ్యక్తి సురేశ్‌కు చెందిన ఆటోలో 20 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనం చేసుకుని రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై లోభానంద్, సిబ్బంది సురేశ్ ఉన్నారు.

పాము కాటుకు యువకుడి మృతి


మహేశ్ (ఫైల్)

దహెగాం: పాము కాటుకు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పంబాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పంబాపూర్ గ్రామానికి చెందిన కంబాల మహేశ్ (22) ఈనెల 2న ఇంట్లో ఉండగా లగ్గాం గ్రామానికి చెందిన బాబా అనే వ్యక్తి ఫోన్ చేసి బాత్రూమ్‌లో పాము ఉంది కొట్టడానికి రావాలని పిలిచాడు. దీంతో మహేశ్ వెంటనే బాబా ఇంటికి వెళ్లి బాత్రూమ్ డోర్ తీస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే మహేశ్ కుటుంబీకులకు విషయం తెలుపగా దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహేశ్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి పెదనాన్న పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఎడ్లబండి పైనుంచి పడి ఒకరి మృతి

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామానికి చెందిన తనుగుల మల్లయ్య (45) శుక్రవారం ఎడ్లబండి కిందపడి మృతిచెందాడు. మల్లయ్య తన భార్య కవితతో వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్లబండిపై వెళ్తుండగా మార్గమధ్యలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లయ్య ఛాతి పైనుంచి బండి చక్రం వెళ్లగా అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే కవిత 108లో మల్లయ్యను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతడు చనిపోయినట్లు నిర్ధారించారు. కవిత ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

అడవి బిడ్డలు.. సంస్కృతి రక్షకులు

- సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత
- యాస.. భాష పరిరక్షణకు చర్యలు
- భావితరాలకు అందించే యత్నం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


ఇంద్రవెల్లి: రాజుల్ దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలకు ఆదివాసీ గిరిజనులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొండ, కోనల నడుమ ప్రకృతితో మమేకమవుతున్నారు. ప్రకృతిని దైవంగా భావించి జీవనం సాగిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార, వ్యవహారాలను పాటిస్తూ వాటిని భావితరాలకు అందిస్తున్నారు. ఏ పని చేసినా, ఈ కార్యం తలపెట్టినా ముందుగా ప్రకృతి దేవతలకు పూజలు చేసే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. వనదేవతలకు పూజలు చేశాకే సాగు పనులు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొలాం, తోటి, నాయక్‌పోడ్, గోండు, పర్ధాన్, అంధ్, లంబాడీ తెగలుగా ఉన్న ఆదివాసీ గిరిజనులు ప్రతీ పండుగ, కుల దేవతల పూజలు, పెళ్లి వేడుకలు ఇలా ఏవైనా వారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వైభవంగా నిర్వహిస్తారు.

ఆదివాసీ తెగలు.. పండుగలు

గోండు, కొలాం, పర్ధాన్, తోటి ఆదివాసీ తెగల వారు కుల దేవతలతోపాటు ప్రకృతి దేవతలను ఆరాధిస్తారు. ఏ పూజ చేసినా.. తరతరాలుగా గ్రామస్తులంతా సామూహికంగా చేసే ఆచారాన్ని పాటిస్తున్నారు. ఆషాఢ మాసం ప్రారంభంలో అకాడి (వన దేవత) పూజలతో మొదలుకుని నాలుగు నెలలపాటు యేత్మసుర్ దేవతలను ఆరాధిస్తారు. శ్రావణ మాసానికి ముందు గావ్ సాత్ పేరుతో పోచమ్మ తల్లికి పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో నెలపాటు గ్రామ దేవతలు శివ బోడి, నొవోంగ్ పూజలను ఘనంగా నిర్వహిస్తారు. దీపావళి సందర్భంగా యేత్మసుర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడీ వేషధారణలతో వారంపాటు సంప్రదాయ వాయిద్యాల మధ్య దండారీ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. వైశాఖ, పుష్య మాసాల్లో సంవత్సరానికి రెండుసార్లు కులదేవతలైన జంగుబాయి, పెర్సాపేన్, భీం దేవుడి పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. పుష్యమాసంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, రాష్ట్రంలో రెండో పండుగైన నాగోబా మహాపూజ, నాగోబా జాతరను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెస్రం వంశీయులు ఘనంగా నిర్వహిస్తారు. అంద్ సమాజ్ ఆదివాసీలు తమ కులగురువు శ్రీశ్రీ సంత్ సద్గురు పులాజీబాబాను ఆరాధిస్తారు. వారివారి గ్రామాల్లో నిర్మించిన ధ్యాన్ మందిరాల్లో ప్రతీ సంవత్సరం వార్షికోత్సవ పూజలు చేస్తారు. నాగుల పంచమి మరుసటిరోజు శీరల్ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అంధ్ ఆదివాసీ సమాజ్ వారి వివాహాలు పులాజీబాబా ధ్యాన్ మందిరాల్లో సామూహికంగా జరిపిస్తారు. నాయక్‌పోడ్ ఆదివాసీ భీమన్న దేవుడిని ఆరాధ్యదైవంగా కొలిచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లంబాడా గిరిజనులు కులగురువు సంత్ సేవలాల్ మహరాజ్‌ను ఆరాధించడంతో పాటు ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమి తరువాత వారంపాటు తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. ప్రతిరోజూ గ్రామాల్లోని ఆలయాల్లో సేవాలాల్, జగదాంబదేవిని ఆరాధిస్తారు.

వాయిద్యాలు.. ప్రత్యేకతలు


ఉట్నూర్‌రూరల్: గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

గోండులు పెర్సపెన్ పండుగలో దండారీ డప్పుల దరువులతో తుడుం వాయిద్యాన్ని నిర్వహిస్తుంటారు. కొలాంలు పోలకమ్మ పండుగ, భీమయ్యక్ ఉత్సవం (సట్టి దెయ్యాల్), దండారీ, దసరా పండుగల్లో మోగిస్తుండగా, గోండులు జంగుబాయి, పెర్సపెన్, దండారీ ఉత్సవాల్లో తుడుంను డోలుకు సహ వాయిద్యంగా మోగిస్తుంటారు. అలాగే డెంసా నృత్యాలు చేస్తుంటారు. ఆదివాసీలకు ఒక తరం నుంచి మరొక తరానికి సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వంగా వస్తున్నాయి. తుడుంను పురుషవాద్యంగా భావిస్తారు. ఈ సంగీత వాద్యాన్ని పూజా కార్యక్రమంలో ఉంచి పూజిస్తారు. ఆదివాసీల చైతన్యానికి 'తుడుం' ఒక సంకేతంగా నిలిచింది. ఆదివాసీ ఉద్యమాల్లో ర్యాలీ, ధర్నా లాంటి నిరసన కార్యక్రమాల్లో 'తుడుం' మోగిస్తుంటారు. గోండి పూజారులైన ప్రధాన్లు, తోటి తమ తెగ ఆచారాన్ని పాటిస్తూ జరిపే మత క్రతువులు, కర్మకాండలు, వివాహాలు, చావుల సందర్భంలో దీనిని వాయిస్తారు. గోండి సంప్రదాయాలు, గౌరవానికి ఇది సంకేతం. కిక్రితో పాటు 'పెప్రే' అనే రెండు సన్నాయి వాయిద్యాలు, డక్కి అనే చర్మవాయిద్యం అన్నీ కలిసి సామూహికంగా వాయిస్తారు. డోలు లేని ఆదివాసీ ఊరు ఉండదు. డోలు వాయిద్యానికి ప్రత్యేకమైన జానపద గేయాలు, నృత్యాలు ఉంటాయి. హోలీ, వివాహ వేడుకలకు డోలు నృత్యాలతో కళాకారులు అలరిస్తుంటారు. ఆదివాసీ వ్యక్తి మరణిస్తే అతని దహన సంస్కారాల సందర్భంగా దీనిని వాయిస్తారు. డోలును వివాహ వేడుకల సందర్భంగా రాత్రి వేళ నృత్యాలు చేయడానికి వినియోగిస్తుంటారు. ఒక్కో సందర్భంలో ఒక గ్రామంతో మరో గ్రామం మధ్య పాటల పోటీలు జరుగుతుంటాయి. డోలు వాయిస్తూ పురుషులు స్త్రీ వేషధారణలో, ఒకరు జోకర్‌గా నృత్యాలు చేస్తుంటారు.

యాస.. భాషకు డిజిటల్ రూపం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు మాట్లాడే యాస.. భాష.. సంస్కృతిని డిజిటల్ రూపంలో భద్రపర్చడానికి బోలి చేతో (భాష–చైతన్యం) ఫౌండేషన్ కృషి చేస్తోంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చెరిగిపోకుండా భావితరాలకు అందించడానికి గోండి, కొలామీ భాషలో వికీపీడియా, విక్షనరీలను అంతర్జాలంలో భద్రపర్చి భావితరాలకు భాష, సాహిత్య సంపదను అందించడానికి కార్యశాల నిర్వహిస్తూ ఆదివాసీ యువకులను ప్రోత్సహిస్తోంది.

– ఆత్రం మోతీరాం, బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యుడు

గోండి, కొలామి భాష పరిరక్షణలో..



ఆదిలాబాద్ రూరల్: మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గోండి, కొలామి భాషల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి రోబోటిక్ టెక్నాలజీ కంప్యూటర్ ద్వారా యాంకర్‌ను తయారు చేసి గోండి భాషలో వార్తలు చదివిస్తున్నారు. గోండి, కొలామి, తెలుగు, హిందీ, ఆంగ్లం, లంబాడా భాషల్లో వందలాది పాటలు రాసి ఏఐలో పొందుపర్చారు. మహాభారత గ్రంథాన్ని తెలుగు లిపితో గోండి భాషలో అనువదించారు. 18 పర్వాలు నాలుగు నెలలపాటు అనువదించి వంద పుస్తకాలు ప్రచురితం చేశారు. మన్‌కీబాత్‌లో పీఎం మోదీ కైలాస్‌ను ప్రశంసించారు. అప్పటి కలెక్టర్లు దివ్యదేవరాజన్, దేవసేన, ప్రస్తుత కలెక్టర్ రాజర్షిషా కైలాస్‌ను అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాల రక్షణలో..



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవితరాలకు అందించేందుకు పాండి పారీ కుప్పర్ లింగో హీరా సుకా దేవతల వేషధారణలతో ఆటపాటలతో మెస్రం రేలా రవి కృషి చేస్తున్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా గోండి ధర్మాన్ని కాపాడుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బాలికల గురుకులంలో చొరబడిన నలుగురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఎస్సై రామకృష్ణ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం అర్ధరాత్రి అక్రమంగా చొరబడి విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేసిన నలుగురిని శుక్రవారం తాళ్లగురిజాల పోలీసులు అరెస్ట్ చేశారు. తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామానికి చెందిన దుగుట సంజయ్, కోనూరి కిరణ్, కన్నెపల్లి మండలం చర్లపల్లి, ఎల్లారం గ్రామాలకు చెందిన గొల్లపల్లి కిరణ్, కొజ్జిన కిరణ్ మద్యం మత్తులో బాలికల గురుకుల విద్యాలయంలో అక్రమంగా చొరబడ్డారు. కేకలు వేస్తూ, బూతులు తిడుతూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేశారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా కోనూరి కిరణ్ పట్టుబడగా ముగ్గురు పారిపోయారు. అక్రమంగా విద్యాలయంలో చొరబడిన ఘటనపై విద్యాలయ ప్రిన్సిపాల్ నిరుపమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం, గంజాయి మత్తులో యువత ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళ అనుమానాస్పదంగా తిరిగి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రాత్రి వేళ గస్తీ, భద్రతను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

యువకుడి మృతికి కారకులైన ఇద్దరి అరెస్ట్

నెన్నెల: యువకుడి మృతికి కారకులైన ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన ఓ మహిళ, అవుడం గ్రామానికి చెందిన మూడేపల్లి తిరుపతితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆమె కొడుకు అనిల్ పలుసార్లు పద్ధతి మార్చుకోవాలని తల్లికి చెప్పినా తీరుమార్చుకోలేదు. దీంతో తిరుపతి ఇంటికి వెళ్లి హెచ్చరించాడు. అయినా వారిద్దరు అనిల్ మాటలను పట్టించుకోలేదు. పైగా అనిల్‌ను చంపుతానని తిరుపతి బెదిరించాడు. తల్లితీరు మారకపోవడం, తిరుపతి బెదిరింపులతో మనస్తాపం చెందిన అనిల్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అనంతరం తన చావుకు తిరుపతితో పాటు తన తల్లి కారణమని చనిపోయే ముందు ఆస్పత్రిలో సెల్ఫీ వీడియో తీసి బంధువులు, స్నేహితులకు పంపించాడు. మృతుడి తండ్రి చిన్నబాబు ఫిర్యాదు మేరకు గురువారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం పోలీసులు దర్యాప్తు చేసి అనిల్ మృతికి కారణమైన తిరుపతితోపాటు అనిల్ తల్లిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

పోడు కోసం పోరు


శ్రీరామ జిన్నింగ్ ఆవరణలో సేద తీరుతున్న రైతులు

తాండూర్: దశాబ్దాలుగా పోడు సాగు చేసుకుంటున్న తమకు వాటిపై హక్కులు కల్పించాలని రైతులు పోరుబాట పట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు మూడురోజుల క్రితం చేపట్టిన పాదయాత్ర గురువారం రాత్రి తాండూర్‌కు చేరుకుంది. మండలంలోని రేపల్లెవాడ సమీపంలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో సేద తీరిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున రైతులు తమ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా గ్రామ శివారులోని సుమారు 1,200 ఎకరాలను సాగు చేసుకుంటూ 600 కుటుంబాలవాళ్లం జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది అటవీశాఖ అధికారులు సాగు చేసుకోకుండా అడ్డుకున్నారని వాపోయారు. తమకు న్యాయం చేసి భూ హక్కు పత్రాలు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి, అధికారులకు తమ గోడు చెప్పుకొంటామని వారు పేర్కొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గంగారాం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ప్రసన్నాంజనేయనగర్‌కు చెందిన గంగాధరి వాణి(44) అనే మహిళ అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం దేవాపూర్‌కు చెందిన శంకర్‌తో వాణి వివాహం జరిగింది. కొంతకాలంగా శంకర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో వాణి టైలరింగ్ పని చేస్తూ ఇంటి భారాన్ని మోసింది. తనకు వచ్చే డబ్బులు సరిపోకపోవడం, అప్పులు ఉండడంతో మనోవేదనకు గురై ఈనెల 6న మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గమనించిన భర్త వెంటనే గ్రామంలోని కంపెనీ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించగా కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిస్తుండగా రాత్రి మృతిచెందింది. మృతురాలికి 11 ఏళ్ల కొడుకు విజ్ఞతేజ్ ఉన్నాడు. మృతురాలి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

రెబ్బెన: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మండలంలోని నంబాలకు చెందిన రత్నం నారాయణ (47) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే నారాయణ పదేళ్లుగా షుగర్‌తో బాధ పడుతున్నాడు. ఇటీవల మరికొన్ని అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. అనారోగ్య సమస్యలు భరించలేక చనిపోవాలని ఉందని తరచూ కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి తనకు అస్వస్థత ఉన్నట్లు భార్య ప్రమీలకు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు నారాయణను రెబ్బెన పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

వాంకిడి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన చాప్లే వెంకటేశ్ (30) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్లుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో కడుపు నొప్పి వచ్చినప్పుడల్లా మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3న సాయంత్రం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకోగా బుధవారం ఇంటికి తీసుకువచ్చారు. కాగా, గురువారం సాయంత్రం అస్వస్థతకు గురైన అతడిని వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లలిత, ముగ్గురు కూతుళ్లు, కుమారుడున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జన్నారం: జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోటిగూడకు చెందిన గాలి నాగేశం (40) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లి పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చడానికి భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయినా అప్పు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 5న మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, కూతురు, కొడుకు ఉన్నారు. విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.